సాక్షి అనంతపురం

గురువారం । 9 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.23,190

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23,190 పలికాయి.



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.3°/ 12.1°

జిల్లా అంతటా బుధవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రోడ్డు ఆక్రమణకు 'పచ్చ' స్కెచ్

- బూదగవి జగనన్న కాలనీలో తమ్ముళ్ల బరితెగింపు
- మంత్రి కేశవ్ చెప్పారంటూ దౌర్జన్యం



రహదారి స్థలాన్ని జేసీబీతో చదును చేస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ: మండల పరిధిలోని బూదగవి గ్రామంలో 'పచ్చ' నాయకులు బరి తెగించారు. ఏకంగా రోడ్డు ఆక్రమణకు స్కెచ్ వేశారు. వివరాలు.. బూదగవి గ్రామంలోని జగనన్న కాలనీలో సచివాలయానికి వెళ్లేందుకు వీలుగా 40 అడుగుల రోడ్డు ఉంది. ఈ రోడ్డును కబ్జా చేసేందుకు కొంతమంది టీడీపీ నాయకులు మంగళవారం అర్ధరాత్రి రంగంలోకి దిగారు. 10 మీటర్ల పొడువు 40 అడుగుల రోడ్డును జేసీబీతో చదును చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకోగా.. వారిపైనే దౌర్జన్యానికి దిగారు. మంత్రి కేశవ్ చెప్పడంతో ఆక్రమించుకుంటున్నామని చెప్పారని వైఎస్సార్ సీపీ నాయకుడు ధనంజయ తెలిపారు. దీనిపై గ్రామ వీఆర్‌ఓ కృష్ణకీర్తికి ఫిర్యాదు చేయగా రహదారి కోసం వదిలిన స్థలాన్ని కబ్జా చేసేందుకు వీలు లేదన్నారు. విషయాన్ని తహసీల్దార్ మహబూబ్‌బాషా దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా, చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

500 ఎకరాలకు పైగా అడవి బుగ్గిపాలు

కుందుర్పి: గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం సాయంత్రం నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి కుందుర్పి మండలంలోని జంబుగుంపల అటవీ ప్రాంతం రెండు రోజులుగా కాలుతూనే ఉంది. మంటలు ఆర్పేందుకు అధికారులు చేపట్టిన చర్యలు ఆశించిన ఫలితం ఇవ్వలేదు. బుధవారం ఉదయానికి దాదాపు 500 ఎకరాలకు పైగా అటవీ ప్రాంతంలో పచ్చని చెట్లు కాలి బూడిదయ్యాయి.

శతాధిక వృద్ధురాలు కన్నుమూత



వెంకటలక్ష్మమ్మ (ఫైల్)

ఉరవకొండ: మండల పరిధిలోని షేక్షానుపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ముత్తులూరు వెంకటలక్ష్మమ్మ (104) మంగళవారం రాత్రి కన్నుమూశారు. వెంకటలక్ష్మమ్మ భర్త ఓబన్న గతంలోనే చనిపోయారు. వీరికి ముగ్గురు కుమారులు, ఆరుగురు కుమార్తెలు సంతానం. వయసు మీదపడినా వెంకటలక్ష్మమ్మ ఎంతో చురుగ్గా ఉండేవారని గ్రామస్తులు తెలిపారు. తన పనులు తానే చేసుకుంటూ అందరికీ ఆదర్శంగా ఉండేవారని పేర్కొన్నారు.

కీలకమైన ఖరీఫ్ సమయంలో వరుణుడు ముఖం చాటేశాడు. అంతోఇంతో పంటలు చేతికందే సమయంలో విరుచుకుపడ్డాడు. రెక్కలుముక్కలు చేసుకుని పండించిన పంట వర్షార్పణమైంది. మానవత్వంతో రైతును ఆదుకోవాల్సిన చంద్రబాబు సర్కార్ పగ బట్టింది. ఆవేదన ఆకాశాన్నంటిన వేళ.. కరువు పరిస్థితుల పరిశీలనకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర బృందం ఎదుట అన్నదాతలు తమ బాధలను ఏకరువు పెట్టారు. ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమంటూ నిట్టూర్చారు.

కష్టాల్లో ఉన్నాం... కనికరించండి



రాప్తాడులో ఉలవ పంటను పరిశీలించి రైతు ద్వారా వివరాలు తెలుసుకుంటున్న కరువు బృందం సభ్యులు

సమస్యల ఏ'కరువు'

- పంటలన్నీ పోయాయి.. అప్పులే మిగిలాయి
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూపాయి సాయం అందలేదు
- దయ చూపకుంటే ఆత్మహత్యలే శరణ్యం
- కేంద్ర కరువు బృందానికి జిల్లా రైతుల వేడుకోలు
- రూ.112.05 కోట్ల సాయం అందించాలని కలెక్టర్ నివేదిక



కేంద్ర బృంద సభ్యులకు తన గోడు వెళ్లబోసుకుంటున్న రైతు

అనంతపురం అగ్రికల్చర్/రాప్తాడు: 'గతి తప్పిన వర్షాలకు సాగు చేసిన పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ప్రత్యామ్నాయ పంటలు కూడా దెబ్బతిన్నాయి. రాష్ట్రం ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందలేదు. కేంద్రం నుంచి చేయూత అందించి ఆదుకోకపోతే మా పరిస్థితి మరింత దయనీయంగా మారుతుంది' అంటూ కేంద్ర కరువు బృందం ఎదుట జిల్లా రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో వాస్తవ పరిస్థితులు తెలుసుకునే నిమిత్తం బుధవారం ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ) జిల్లాలో పర్యటించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన అండర్ సెక్రటరీ జయంతి కనోజియా, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ కె.పొన్నుస్వామితో కూడిన ఇద్దరు సభ్యుల బృందం బుధవారం మధ్యాహ్నం అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో పర్యటించారు. రైతు వన్నూరప్పకు చెందిన ఆముదం పొలం పరిశీలించారు. కరువు పరిస్థితులపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లాకు రూ.112.05 కోట్ల సాయం అందించి ఆదుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్ కేంద్ర బృందానికి నివేదిక సమర్పించారు. రైతులకు రూ.10.93 కోట్లు, పశుశాఖకు రూ.12.15 కోట్లు, గ్రామీణనీటి సరఫరాకు రూ.6.73 కోట్లు, పట్టణ తాగునీటి సరఫరాకు రూ.3.35 కోట్లు, డ్వామా పరిధిలో ఉపాధిహామీ పథకానికి అదనంగా రూ.78.89 కోట్లు ఇవ్వాలని కోరారు. రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, పెద్దమనసుతో ఆదుకోవాలని ఓబిరెడ్డి, తదితర రైతులు మొర పెట్టుకున్నారు. 10 ఎకరాల వరకు 90 శాతంతో డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వాలని, ఉపాధి హామీ కింద అదనపు పనిదినాలు కల్పించాలని, పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

ఆత్మహత్యలే శరణ్యం..

మన్నీల పర్యటన అనంతరం స్థానిక ఆర్‌డీటీ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం 4.30 నుంచి 5.30 వరకు కేంద్ర బృంద సభ్యులు రాప్తాడు మండలంలో పర్యటించారు. పామళ్ల కొండప్పకు చెందిన ఉలవ పంటను పరిశీలించారు. పంట కోసం దాదాపు రూ.2.50 లక్షల పెట్టుబడి పెట్టానని, ఎకరాకు బస్తా దిగుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోయాయని కొండప్ప వాపోయారు. అనంతరం కేంద్ర బృంద సభ్యులు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పంపు కొండప్ప, అమరనాథరెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ ప్రధాన పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటలు కూడా తీవ్రంగా దెబ్బతినడంతో తమ పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పశువులకు గ్రాసం కూడా దొరకడం లేదన్నారు. కేంద్రం నుంచి సాయం అందించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆందోళన వెలిబుచ్చారు. రైతులకు డ్రిప్ మంజూరులో 18 శాతం జీఎస్టీ వేస్తున్నారని, దాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి ప్రసాద్‌తో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు కేంద్ర బృందానికి వినతి ప్రత్రాలు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, డ్వామా పీడీ సలీంబాషా, ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు, ఏడీఏలు ఎం.రవి, ఓబుళపతి, యల్లప్ప, లక్ష్మానాయక్, టెక్నికల్ ఏఓ బాలానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

రాప్తాడు రూరల్: జిల్లాకు కేంద్రం నుంచి రూ.10 వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని సీపీఎం నాయకులు విన్నవించారు. ఈ మేరకు కేంద్ర బృందం సభ్యులకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ రైతు రుణాలు మాఫీ చేయాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం అందించాలన్నారు. కూలీలకు ఉపాధిహామీ కింద అదనపు పనిదినాలు కల్పించాలన్నారు. పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే భరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజినేయులు తదితరులు ఉన్నారు.

31 మండలాల్లోనూ కరువు

జిల్లాలోని 31 మండలాల్లోనూ కరువు విలయ తాండవం చేస్తోందని, ఉదారంగా రైతులను ఆదుకోవాలని కేంద్ర బృందం సభ్యులను సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ కోరారు. దెబ్బతిన్న ఆహార పంటలకు ఎకరాకు రూ.30 వేలు, వ్యవసాయ పంటలకు రూ.50 వేలు, ఉద్యాన పంటలకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. ఉపాధి పని దినాలను 200కు పెంచాలన్నారు. బోరు బావులకు మీటర్లు బిగించరాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలో కరువు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కేంద్ర బృందం సభ్యులకు సీపీఐ రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, జిల్లా అధ్యక్షులు చెన్నప్ప యాదవ్, ఉపాధ్యక్షుడు పి. రామకృష్ణ, నాయకులు ఎం. రామకృష్ణ, ఎం. రమేష్, మన్నీల వెంకట రాముడు, నాగేష్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార ఆర్భాటం.. ఆచరణలో శూన్యం

- ముగిసిన రెవెన్యూ సదస్సులు
- 503 గ్రామాల్లో మొక్కుబడిగా సాగిన వైనం
- అర్జీల స్వీకరణకే పరిమితమైన అధికారులు
- అందిన అర్జీలు 6,856, పరిష్కరించింది కేవలం 1,750



ఉరవకొండ మండలం రేణిమాకులపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

అనంతపురం అర్బన్: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం నిర్వహించిన రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయి. మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో గత నెల 6న సదస్సులను ఆర్భాటంగా ప్రారంభించారు. 33 రోజుల పాటు 503 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు మొక్కుబడిగా సాగాయి. భూ సమస్యలపై అందిన ఫిర్యాదుల పరిష్కారానికి ఏ గ్రామంలోనూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన దాఖలాలు లేవు. మొత్తంగా ఈ సదస్సులు ఫిర్యాదుల స్వీకరణకే పరిమితమయ్యాయనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

వేలల్లో అర్జీలు..

కళ్యాణదుర్గం, అనంతపురం, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 503 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అధికారిక గణాంకాల ప్రకారం ఈ సదస్సులకు 44,093 మంది ప్రజలు హాజరయ్యారు. సదస్సుల్లో అందిన అర్జీలు 6,856 ఉండగా..పరిష్కరించింది కేవలం 1,750 అర్జీలే కావడం గమనార్హం.

- కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 151 గ్రామాల్లో నిర్వహించిన సదస్సులకు 15,436 మంది హాజరయ్యారు. భూ సమస్యలపై 1,439 అర్జీలు అందాయి. వీటిలో 584 అర్జీలు పరిష్కరించినట్లుగా చూపించారు.
- అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 198 గ్రామాల్లో నిర్వహించిన సదస్సులకు 13,635 మంది హాజరయ్యారు. భూ సమస్యలపై 2,585 అర్జీలు అందాయి. వీటిలో 692 అర్జీలు పరిష్కరించారు.
- గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 154 గ్రామాల్లో నిర్వహించిన సదస్సులకు 15,022 మంది హాజరయ్యారు. భూ సమస్యలపై 2,832 అర్జీలు అందాయి. వీటిలో 474 అర్జీలు పరిష్కరించినట్లుగా చూపించారు.

రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా



సమగ్ర శిక్ష ఎస్పీడీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థినులు గీతారెడ్డి, మహాలక్ష్మి

అనంతపురం ఎడ్యుకేషన్: రెండు రోజుల పాటు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించిన ప్రాజెక్ట్‌లు సత్తా చాటాయి. విద్యార్థి, టీచర్ విభాగాల నుంచి ఒక్కో ప్రాజెక్ట్ దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయి. బుధవారం రాష్ట్రస్థాయి ప్రదర్శన ముగిసింది. జిల్లా నుంచి మొత్తం ఆరు ప్రాజెక్ట్‌లు పాల్గొన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీ తెలిపారు. విద్యార్థి విభాగం నుంచి కణేకల్లు మండలం హనకనహాల్ జెడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థినులు పి. గీతా రెడ్డి, డి. మహాలక్ష్మి తయారు చేసిన 'వృద్ధులకు ఊతకర్ర', టీచర్స్ విభాగం నుంచి ఉరవకొండ మండలం ఆమిద్యాల జెడ్పీహెచ్ఎస్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బండి శ్రీనివాసులు తయారు చేసిన 'కాంతి ధర్మాలను సులువుగా వివరించేందుకు ఉపాధ్యాయులకు ఉపకరించే పరికరాలు' ప్రాజెక్ట్‌లు దక్షిణభారతదేశ స్థాయికి ఎంపికయ్యాయని వెల్లడించారు. వీరికి సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంస పత్రాలు అందజేశారు. పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో వీరి ప్రాజెక్ట్‌లు పదర్శించనున్నారు.



అవార్డు అందుకుంటున్న టీచరు బండి శ్రీనివాసులు

'దుర్గం'లో రెడ్ బుక్ అరెస్టు

- వైఎస్సార్‌సీపీ నేత బిక్కి హరి అక్రమ అరెస్టు
- పట్టణ పోలీసు స్టేషన్ వద్ద పోలీసుల ఓవరాక్షన్
- హరిని పరామర్శించిన పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య



పట్టణ పోలీసుస్టేషన్ వద్ద డాక్టర్ తలారి రంగయ్య, తిప్పేస్వామి, పార్టీ శ్రేణులు (ఇన్‌సెట్‌లో) వైఎస్సార్‌సీపీ నేత బిక్కి హరి

కళ్యాణదుర్గం: పట్టణంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ కూటమి నేతలు రెడ్ బుక్ అరెస్టులు చేయించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే బుధవారం కళ్యాణదుర్గం మార్కెట్‌యార్డు మాజీ చైర్ పర్సన్ బిక్కి నాగలక్ష్మి భర్త, వైఎస్సార్‌సీపీ నేత బిక్కి హరిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. కళ్యాణదుర్గం మునిసిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌ను దూషించి, విధులకు ఆటంకం కలిగించారని పోలీసులకు ఫిర్యాదు అందింది. దీని ఆధారంగా డీఎస్పీ రవి బాబు, సీఐ యువరాజు ఆదేశాల మేరకు పోలీసులు హరిని అరెస్టు చేశారు.

చర్చించినందుకే కేసు

కమిషనర్ వంశీకృష్ణను మంగళవారం బిక్కి హరి కలిశారు. మునిసిపాలిటీలో తమ పార్టీ కౌన్సిలర్లకు కూడా విలువ ఇవ్వాలని కోరారు. ఒకే పార్టీకి వత్తాసు పలకడం సరికాదన్నారు. ఇంతకు మించి అక్కడేమీ జరగలేదు. అయినప్పటికీ కమిషనర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విధులకు ఆటంకం కలిగిస్తూ.. తనను దూషించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పోలీసుల ఓవరాక్షన్

బిక్కిహరి అరెస్టు విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి పార్టీ శ్రేణులతో కలిసి కళ్యాణదుర్గం పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే హరిని పరామర్శించేందుకు కూడా వెళ్లనీయకుండా పోలీసులు ఓవరాక్షన్ చేశారు. సీఐ యువరాజుతో చర్చించిన అనంతరం నేతలు పోలీసు కస్టడీలో ఉన్న బిక్కి హరిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఎఫ్ఐఆర్ ఇచ్చేందుకు కూడా నిర్లక్ష్యం

పోలీసు స్టేషన్ నుంచి రాత్రి 8 గంటలకు సీఐ యువరాజు.. బిక్కి హరిని జడ్జి ముందు హాజరుపరిచేందుకు తీసుకెళ్లారు. అయితే మధ్యాహ్నం సమయానికే రిమాండు రిపోర్టుతో పాటు ఎఫ్ఐఆర్‌ను సిద్ధం చేసిన పోలీసులు హరి తరఫున న్యాయవాదులకు కానీ, కుటుంబ సభ్యులకు కానీ కాపీలను ఇచ్చేందుకు నిరాకరించారు. బెయిల్ రానివ్వకుండా రాజకీయ ఒత్తిళ్లతో ఈ పన్నాగం పన్నినట్లు పార్టీ శ్రేణులు మండిపడ్డాయి.అయితే ..జడ్జి నివాసానికి తీసుకెళ్లే 20 నిమిషాల ముందు ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వడం కొసమెరుపు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ ముందు హాజరు పరచగా.. ఆయన కేసు పూర్వపరాలను పరిశీలించి బెయిల్ మంజూరు చేశారు.

ఉద్యోగులను ఉసిగొలిపి..

కమిషనర్ బుధవారం ఉదయం మునిసిపల్ సిబ్బందిని, సచివాలయ ఉద్యోగులను ఉసిగొల్పి పట్టణంలో బిక్కి హరికి వ్యతిరేకంగా ర్యాలీ చేయించారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో నినాదాలు చేస్తూ పోలీసులకు బిక్కి హరిపై ఫిర్యాదు చేశారు.

అక్రమ అరెస్టులు సహించబోం

బిక్కిహరిని అరెస్టు చేయడం సరైంది కాదు. నేను పోలీసు అధికారిగా, మునిసిపల్ కమిషనర్‌గా, డీఆర్‌డీఏ పీడీగా పనిచేశా. నాతో పాటు పార్టీ శ్రేణులు ఎప్పుడూ ఉద్యోగులుగా అండగానే ఉంటున్నాం. కానీ ఇక్కడి కమిషనర్ రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదు. మునిసిపల్ కౌన్సిల్ మీట్ పెట్టాలని పాలక వర్గం పలుమార్లు కమిషనర్‌ను కోరినా పట్టించుకోలేదు. ఆయన వ్యవహార శైలిపై కలెక్టర్, మునిసిపల్ రీజినల్ డైరెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశాం. ఇలాంటి అక్రమ కేసులకు మేము భయపడేది లేదు.

– తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త

క్లాస్-4 ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కార్పొరేషన్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న క్లాస్-4 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. 18 ఎఫ్ఎన్‌ఓ, 11 శానిటరీ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. https://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 20లోపు పూర్తి చేసి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

రేపటి నుంచి సంక్రాంతి సెలవులు

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాలలకు ఈనెల 10 నుంచి 19 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. 2024–25 అకడమిక్ కేలండర్ ప్రకారమే సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. 20న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. మైనార్టీ విద్యా సంస్థలకు 11 నుంచి 15 వరకు సెలవులు ఉంటాయని డీఈఓ తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు సంబంధించి వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈనెల 10 నుంచి 12 వరకు ఇంటివద్ద సన్నద్ధం కావాల్సి ఉంటుందన్నారు. 13 నుంచి 15 వరకు యాక్షన్ ప్లాన్ అమలు ఉండదన్నారు. తిరిగి 16 నుంచి 19 వరకు ఇంటివద్దే సన్నద్ధం కావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

శనేశ్వర స్వామి విగ్రహం ధ్వంసం


శనేశ్వర స్వామి విగ్రహం కుడి చేతిని పగులగొట్టిన దృశ్యం

హిందూపురం అర్బన్: స్థానిక మోతుకపల్లి సమీపంలో శనేశ్వర స్వామి ఆలయం ఆర్చ్ వద్ద ఏర్పాటు చేసిన స్వామి వారి రాతి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. ఈ నెల 6, 7 తేదీల్లో ఈ ఆలయానికి సమీపంలోనే ఇస్తేమా జరిగింది. అయితే విగ్రహాన్ని ఎవరు ధ్వంసం చేశారు అనే అంశంపై స్పష్టత లేదు. ఆలయ నిర్వాహకుల నుంచి ఫిర్యాదు అందుకున్న వన్‌టౌన్ పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. కాగా, విగ్రహం ధ్వంసంపై విశ్వ హిందూపరిషత్, హిందూ సంఘాల నాయకులు మండిపడ్డారు. రాష్ట్రంలో హిందూ ఆలయాలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు శనీశ్వర స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తాడిపత్రిలో వరుస చోరీలు

తాడిపత్రి టౌన్: స్థానిక టైలర్స్ కాలనీ, టీచర్స్ కాలనీలో మంగళవారం రాత్రి తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దుండగులు వరుస చోరీలకు తెగబడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... టైలర్స్ కాలనీలో నివాసముంటున్న కట్టుబడి అల్లాబకాస్ మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి బంధువుల ఇంటికి వెళ్లారు. విషయాన్ని గుర్తించిన దుండగులు అర్ధరాత్రి సమయంలో ఇంటి తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి, రూ.20వేల నగదు, బంగారు ఆభరణాలు అపహరించారు. అనంతరం అదే కాలనీలో నివాసముంటున్న చాంద్‌బీ ఇంటికి వేసిన తాళం బద్దలుకొట్టి లోపలకు ప్రవేశించి రూ.10 వేల నగదు అపహరించుకెళ్లారు. టీచర్స్ కాలనీలోని నాగేశ్వరరావు ఇంటి తాళాలు బద్దలుగొట్టి చోరీకి విఫలయత్నం చేశారు. విషయం తెలుసుకున్న సీఐ సాయిప్రసాద్, ఎస్‌ఐ గౌస్‌బాషా.. బాధితులను ఇళ్లను పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బెంగళూరులో వలస కూలీ మృతి


చిన్న రాజన్న (ఫైల్)


బ్రహ్మసముద్రం: బతుకు తెరువు కోసం బెంగళూరుకు వలస వెళ్లిన వ్యక్తి అక్కడ చోటు చేసుకున్న ప్రమాదంలో మృతిచెందాడు. వివరాలు... బ్రహ్మసముద్రం మండలం అజ్జయ్యదొడ్డి గ్రామానికి చెందిన పూజారి చిన్నరాజన్న (44)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకు తెరువు కోసం బెంగళూరుకు వలస వెళ్లి అక్కడ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం తాను పనిచేస్తున్న ప్రాంతంలో అడ్డుగా ఉన్న చెట్టుపైకి ఎక్కి కొమ్మలు కత్తిరిస్తుండగా అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కూలీలు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు.

సంక్రాంతి పండగ అంటే పల్లెల్లో ఎంతో సందడి ఉంటుంది. జనవరి నెల మొదలు కాగానే అన్ని గ్రామాల్లో ఈ పండుగ వాతావరణం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రతి రోజూ ఇంటి ముందు ముగ్గులు వేయడం, హరిదాసుల సంకీర్తనలు, అందరూ కలసి ఒక చోట చేరి ఆడిపాడి సందడి చేయడం, ముగ్గుల పోటీలు నిర్వహించడం, వివిధ క్రీడా పోటీలు లాంటి కార్యక్రమాలు ఎంతో సందడిగా జరుగుతుంటాయి. అయితే ఇందుకు భిన్నంగా కొన్ని శతాబ్దాలుగా సంక్రాంతి పండుగకు ఓ గ్రామంలో సగానికి పైగా ప్రజలు దూరంగా ఉంటున్నారు. ఇందుకు గల కారణాలు... విశేషాలు తెలుసుకోవాలంటే ఆత్మకూరు మండలంలోని పి.కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించి తీరాల్సిందే.

– ఆత్మకూరు:


పి.కొత్తపల్లి ముఖచిత్రం

వారికి సంక్రాంతి లేదు!


ఓ ఊరి కథ

- ఆత్మకూరు మండలం పి.కొత్తపల్లిలో వింత ఆచారం
- శతాబ్దాలుగా పండుగ సంబరాలకు దూరంగా బోదపాటి వంశీకులు

ఆత్మకూరు నుంచి కళ్యాణదుర్గం వెళ్లే మార్గంలో ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే జాతీయ రహదారికి ఓ కిలోమీటరు దూరంలో పి.కొత్తపల్లి గ్రామం వస్తుంది. ఈ గ్రామంలో కమ్మ, బోయ, ఎస్సీ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. దాదాపు 300 గడపలున్న ఈ గ్రామ ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. వరి, చీనీ, వేరుశనగ, టమాట పంటల సాగుతో జీవనం సాగిస్తున్నారు. గ్రామం చుట్టూ ఎటు చూసినా పచ్చని పంట పొలాలు కనువిందు చేస్తుంటాయి. సమైక్య జీవనానికి, స్వశక్తికి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలుగా ఈ గ్రామస్తులు నిలుస్తున్నారు.

అనాదిగా వస్తున్న ఆచారాన్ని గౌరవిస్తూ..

సంక్రాంతి పండుగ విషయంలో బోదపాటి వారి భయాందోళనకు కారణమూ లేకపోలేదు. ఇందుకు సంబంధించి ఓ పురాతన కథను నేటికీ పూర్వీకులు చెబుతున్నారు. శతాబ్దాల క్రితం సంక్రాంతి సరుకుల కొనుగోలు కోసమని గ్రామానికి చెందిన బోదపాటి కుటుంబానికి సంబంధించిన వ్యక్తి ఆత్మకూరు సంతకు వచ్చారు. ఆ సమయంలో ఉన్నఫళంగా ఆయన కుప్పకూలి మృతి చెందాడు. ఇదేదో సాధారణ మృతిగానే అందరూ అప్పట్లో భావించారు. అయితే ఆ మరుసటి సంవత్సరం సంక్రాంతి పండుగ సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన బోదపాటి కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. ఇలా వరుసగా ఏటా సంక్రాంతి పండుగ చేయాలనే ఉద్దేశంతో సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన బోదపాటి కుటుంబంలోని ఎవరో ఒకరు మృత్యువాత పడుతుండడంతో ఒక్కసారిగా వారిలో ఆందోళన మొదలైంది. దీంతో సంక్రాంతి పండుగ జరుపుకోకూడదని బోదపాటి కుటుంబీకులు నిర్ణయించుకున్నారు. నాటి నుంచి నేటి వరకూ సంక్రాంతి పండుగకు బోదపాటి కుటుంబీకులు దూరంగా ఉంటూ వస్తున్నారు.

సంక్రాంతి అంటే బెదరు

హిందూ సంప్రదాయంలో వచ్చే ప్రతి పండుగనూ పి.కొత్తపల్లి వాసులు ఎంతో సంబరంగా జరుపుకుంటారు. అయితే సంక్రాంతి అంటే చాలు ఈ గ్రామంలో సగానికి పైగా జనాభా ఉన్న కమ్మ సామాజిక వర్గంలోని బోదపాటి వారు బెదిరిపోతుంటారు. సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంటి ముంగిట కనిపించే రంగవల్లులు వీరి ఇళ్ల ముందు కనిపించవు. గొబ్బెమ్మలు ఉండవు. పిండి వంటలు, నూతన వస్త్రాలకు దూరంగా ఉంటారు. ఇక గ్రామంలో జరిగే సంక్రాంతి సంబరాలకు సైతం బోదపాటి వారు దూరంగా ఉంటారు. రైతు కుటుంబంలో సాధారణంగా భోగి నాడు కనిపించే సందడి ఊసే ఉండదు. పశువులకు, పొలాల్లో నవధాన్యాలకు, ఇంట్లో పూజలు చేయరు. ఒక్క మాటలో చెప్పాలంటే సంక్రాంతి పండుగ నాడు కనీసం స్నానం చేయాలన్నా వీరు భయపడుతుంటారు.

నేను పుట్టినప్పటి నుంచి చూడలేదు



ప్రస్తుతం నాకు 45 సంవత్సరాలు. నేను పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ బోదపాటి వారు సంక్రాంతి పండుగను జరుపుకున్నది చూడలేదు. మా తాతల కాలం నుంచి కూడా ఇదే పద్ధతి కొనసాగుతూ వస్తోంది. ఒకవేళ బోదపాటి కుటుంబీకులు ఎవరైనా ధైర్యం చేసి పండుగ చేసేందుకు సిద్ధమైతే ఏదో ఒక ప్రమాదం బారిన పడుతున్నారు. దీంతో సంక్రాంతి నాడు ఇంట్లో పూజలు కూడా చేయం.

– గోపాల్, పి.కొత్తపల్లి, ఆత్మకూరు మండలం

పెద్దల ఆచారాలు గౌరవిస్తున్నాం



సంక్రాంతి పండుగ అంటే మా పల్లెల్లో అందరూ ఎంతో ఆనందంగా గడుపుతారు. కొత్త అల్లుళ్ల రాకతో ప్రతి ఇంట్లోనూ సందడిగా ఉంటుంది. కానీ, బోదపాటి వంశానికి చెందిన దాదాపు వంద కుటుంబాల వారు సంక్రాంతి పండుగ చేసుకోం. పెద్దల ఆచారాలు గౌరవిస్తూ ఇళ్ల ముందు ముగ్గులు వేయడం, ఇల్లు, వాకిలి శుభ్రం చేయడం ఇతర ఆచారాలు ఏవీ చేయం.

– రమాదేవి, పి.కొత్తపల్లి, ఆత్మకూరు మండలం

స్నానం కూడా చేయం



సంక్రాంతి అంటే అందరూ ఆనందంగా జరుపుకుంటారు. కానీ మా బోదపాటి వారు స్నానాలు కూడా చేయరు. పండుగ చేసుకుంటే ఏం జరుగుతుందో అనే భయం అందరిలోనూ ఉంది. దీంతో చాలా ఏళ్లుగా పండుగనాడు కూడా సాధారణ వంటకాలతోనే సరిపెట్టుకుంటాం.

– రాజప్ప, పి.కొత్తపల్లి, ఆత్మకూరు మండలం

నేడు 'అనంత'లో డాకూ మహారాజ్ ప్రీ రిలీజ్ వేడుక

అనంతపురం కల్చరల్: నందమూరి బాలకృష్ణ నటించిన 'డాకూ మహారాజ్' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ గురువారం అనంతపురంలో నిర్వహించనున్నారు. స్థానిక శ్రీనగర్ కాలనీ (రాంనగర్ 80 ఫీట్ రోడ్డు)లోని అయ్యప్పస్వామి ఆలయానికి సమీపంలో ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు వేడుక జరగనుంది. మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. అదేవిధంగా హీరో బాలకృష్ణతో పాటు సినిమా యూనిట్ తరలిరానుంది. ఇప్పటికే జూనియర్ ఆర్టిస్టులు, డ్యాన్సర్లు అనంతకు చేరుకున్నారు. భారీఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అభిమాన సంఘాల తరపున కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు గౌసుమొద్దీన్ తెలిపారు.

జిల్లాలో 'నాట్కో' క్యాన్సర్ ఆస్పత్రి

- ఎమ్మెల్సీ శివరామిరెడ్డి వెల్లడి



ఉరవకొండ: జిల్లాలో రూ.45 కోట్ల వ్యయంతో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు నాట్కో ఫార్మా సంస్థ ముందుకు వచ్చిందని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. బుధవారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 'నాట్కో ఫార్మా సంస్థ గుంటూరులో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేసిన విషయం తెలుసుకుని, అలాంటి ఆస్పత్రిని వెనుకబడిన అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయించేందుకు గత రెండేళ్లుగా ప్రయత్నించా. జిల్లాలో చాలా మంది క్యాన్సర్ బారిన పడిన వారు చికిత్స అందక ఇబ్బంది పడుతున్నారు. బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి రూ.లక్షలు వెచ్చించి చికిత్స చేయించుకోలేని నిరుపేదల దుస్థితిని నాట్కో చైర్మన్ నన్నపనేని వెంకయ్యచౌదరిను కలిసి వివరించాను. దీనిపై స్పందించిన నాట్కో ఫార్మా కంపెనీ వారు అనంతపురంలో రూ.45 కోట్ల వ్యయంతో 110 పడకల క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఇందుకు చొరవ తీసుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎం చంద్రబాబు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీతో పాటు కలెక్టర్, నాట్కో చైర్మన్‌కు ధన్యవాదాలు' అని తెలిపారు.

చెరువులో వ్యక్తి మృతదేహం


హుస్సేన్‌పీరా (ఫైల్)

గుంతకల్లు రూరల్: ఐదు రోజుల క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి బుధవారం వైటీ చెరువులో మృతదేహం తేలాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వైటీ చెరువు గ్రామానికి చెందిన హుస్సేన్‌పీరా (74), షేకూన్‌బీ దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 2న పొలానికి వెళ్లి వస్తానంటూ ఇంటి నుంచి బయటకు పోయిన హుస్సేన్‌పీరా ఆ తర్వాత పత్తా లేకుండా పోయాడు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రెండు రోజుల క్రితం బాధిత కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు గుంతకల్లు రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి, గాలింపు చేపట్టారు. బుధవారం ఉదయం వైటీ చెరువు గ్రామంలోని చెరువులో ఓ పురుషుడి మృతదేహం తేలియాడుతుండడం గమనించిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించారు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న షేకూన్‌బీ కుటుంబసభ్యులు మృతుడిని గుర్తించి హుస్సేన్‌పీరాగా నిర్ధారించారు. పొలం పక్కనే ఉన్న చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలను బాధిత కుటుంబసభ్యులు వ్యక్తం చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ధ్వంసం చేస్తుంటే మీరేం చేస్తున్నారు?

- పీఆర్ ఎస్ఈపై జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సీరియస్
- పని తీరు, మాట తీరు మార్చుకోవాలని హితవు


పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: 'ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా రూ.కోట్ల ప్రజాధనంతో ప్రభుత్వం నిర్మించిన రోడ్లను కేబుల్ నెట్‌వర్క్ కోసం కాంట్రాక్టర్లు ధ్వంసం చేసి, వదిలేస్తుంటే మీరేం చేస్తున్నారు?' అంటూ పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) అహమ్మద్ జహీర్ అస్లాంపై జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన స్థాయీ సంఘం 1, 2, 4, 7 సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, సీఈఓ రామచంద్రారెడ్డి, హాజరయ్యారు. కంబదూరు జెడ్పీటీసీ సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ... తమ మండలంలో రహదారులను కేబుల్‌నెట్ వర్క్ నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు ధ్వంసం చేస్తున్నారని, తీసిన మట్టిని రోడ్లపై వేయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీనిపై పీఆర్ ఎస్ఈ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాలన్నారు. మాట తీరు, పని తీరు మార్చుకోవాలని హితవు పలికారు. కాంట్రాక్టర్లపై చర్య తీసుకుని రోడ్లను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు సమావేశ భవన్‌లో ఏర్పాటు చేసిన స్థాయీ సంఘం-3, 5, 6 సమావేశాలకు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, డి.హీరేహాళ్ సభ్యురాలు హసీనా బేగం, గుమ్మఘట్ట జెడ్పీటీసీ మహేష్ అధ్యక్షత వహించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో పంట నష్టం అంచనా కోసం కేంద్ర కరువు బృందం పర్యటిస్తున్న నేపథ్యంలో పచ్చగా ఉన్న పంట పొలాలను చూసి బాగున్నాయనుకుంటే రైతులందరూ నష్టపోతారన్నారు. కళ్ల ముందు కనిపించేది వాస్తవం కాదనే అంశాన్ని కేంద్ర బృందానికి జిల్లా యంత్రాంగం వివరించి.. రైతులకు మేలు జరిగేలా చొరవ తీసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆత్మహత్యలపై అధికారులను అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, నార్పల జెడ్పీటీసీ నాగరత్నమ్మ నిలదీశారు. ప్రైవేటు కాలేజీలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న అనంతపురంలోని రాజేంద్రమున్సిపల్ స్కూల్ సమీపంలోని అంగన్‌వాడీ సెంటర్ వర్కర్ భాగ్యమ్మ అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ మాట్లాడుతూ.. నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

మధ్యవయస్కులే అధికం

- మొత్తం ఓటర్లలో 30–39 వయసు ఓటర్లే 5.69 లక్షలు
- అత్యల్పంగా యువ ఓటర్లు 19.02 శాతం

అనంతపురం అర్బన్: ఓటర్ల తుది జాబితా ప్రకారం జిల్లా ఓటర్లలో మధ్యవయస్కు ఓటర్లు (వయసు 30 నుంచి 49 ఏళ్ల మధ్య వారు) 50.407 శాతంతో అగ్రస్థానంలో ఉన్నారు. అత్యల్పంగా యువ ఓటర్లు (వయసు 18–29 ఏళ్ల మధ్య వారు) 19.022 శాతం ఉండడం గమనార్హం. 8 నియోజకవర్గాల పరిధిలో మొత్తం 20,22,229 మంది ఓటర్లు ఉండగా 30–39 ఏళ్ల వయసు ఓటర్లు 5,69,069 మంది, 40–49 ఏళ్ల వయసు ఓటర్లు 4,50,386 మంది కలిపి మొత్తం మధ్యవయసు ఓటర్లు 10,19,345 మంది ఉండటం గమనార్హం.

అత్యల్పంగా యువ ఓటర్లు...

మధ్య వయస్కుల తర్వాత 20–29 ఏళ్ల వయసు ఓటర్లు 3,60,233 మంది, 50–59 ఏళ్ల వయసు ఓటర్లు 3,09,208 మంది ఓటర్లు ఉన్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి వయసు 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినా కనీస స్థాయిలో ఓటరుగా నమోదు కాలేదు. ఇక వయసు 20–29 ఏళ్ల ఓటర్లు 3,60,233 మంది (17.813 శాతం) ఉన్నారు. మొత్తంగా యువ ఓటర్లు 3,84,698 (19.022 శాతం) ఉన్నారు.

శతాధిక ఓటర్లు 78 మంది..

జిల్లాలో వయసు 100 ఏళ్ల పైబడిన ఓటర్లు 78 మంది ఉన్నారు. 100–109 ఏళ్ల వయసు పురుష ఓటర్లు 39 మంది, మహిళా ఓటర్లు 39 మంది ఉన్నట్లు వెల్లడైంది. ఇక వయసు 90–99 ఏళ్ల ఓటర్లు 3,355 మంది ఉండగా, వీరిలో పురుష ఓటర్లు 1,242 మంది, మహిళ ఓటర్లు 2,093 మంది ఉన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

రాయదుర్గం టౌన్: అఖిల భారతీయ యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు రోజులుగా రాయదుర్గం వేదిక ఏఐవైఎఫ్ 20వ మహాసభలు జరుగుతున్న విషయం తెలిసిందే. స్థానిక చిందనూరు కల్యాణమంటపంలో బుధవారం జరిగిన ఆ సంఘం ప్రతినిధుల సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా కొత్రేష్, ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శామ్యూల్, దేవేంద్ర, కుళ్లాయిస్వామి, సహాయ కార్యదర్శులుగా మోహన్‌కృష్ణ, వంశీకృష్ణ, ధనుంజయ, కోశాధికారిగా శ్రీనివాసులుతో పాటు 23 మందిని కార్యవర్గ సభ్యులుగా, 53 మందిని కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 6, 7 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన లోగోను ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విడుదల చేశారు. కార్యక్రమంలో స్థానిక ఏఐవైఎఫ్ నాయకులు దేవ, కుమార్, నాయక్, తేజ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం


వెంకటచరణ్ రెడ్డి (ఫైల్)

పెద్దపప్పూరు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ నుంచి కిందపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన వెంకటచరణ్‌రెడ్డి (30)కు భార్య సుజాత, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు. నాపరాళ్ల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి నాపరాళ్లను చేర్చేందుకు ట్రాక్టర్‌లో లోడు చేసుకుని బుధవారం ఉదయం తన స్నేహితుడితో కలసి బయలుదేరాడు. 8 గంటల సమయంలో పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట అటవీ ప్రాంతంలో ప్రయాణిస్తుండగా డ్రైవర్ సీట్ పక్కన కూర్చొన్న వెంకటచరణ్‌రెడ్డి కుదుపులకు అదుపు తప్పి కిందపడ్డాడు. డ్రైవింగ్ చేస్తున్న స్నేహితుడు బ్రేక్ వేసే లోపు వెంకటచరణ్‌రెడ్డిపై ట్రాలీ టైర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం


హరికృష్ణ (ఫైల్)

విడపనకల్లు: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లి గ్రామానికి చెందిన బోయ తిమ్మప్ప కుమారుడు హరికృష్ణ(25) వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడుగా ఉండేవాడు. వ్యక్తిగత కారణాలతో మనస్తాపం చెందిన హరికృష్ణ మంగళవారం ఇంట్లో ఉన్న క్రిమి సంహారక గుళికలు మింగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో బుధవారం బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, హరికృష్ణ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

లక్ష్యసాధన దిశగా ఆ నాలుగు

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్‌శాఖ నిర్దేశించిన ఫీజులు, పన్నుల వసూళ్లకు సంబంధించి మార్కెట్ కమిటీల్లో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. జిల్లాలో ఉన్న 9 మార్కెట్‌యార్డుల్లో నాలుగు కమిటీల పరిస్థితి మెరుగ్గా ఉండగా మరో ఐదు కమిటీలు వెనుకబడ్డాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఓవరాల్‌గా మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్‌శాఖ రూ.12.06 కోట్లు వసూళ్లు చేయాలని నిర్దేశించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికానికి రూ.7.75 కోట్ల సాధనతో 65 శాతం ప్రగతి సాధించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో అనంతపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ 73 శాతం లక్ష్యసాధనతో రూ.4.60 కోట్లకు గానూ రూ.3.37 కోట్ల వసూళ్లతో ముందంజలో ఉంది. ఆ తర్వాత రూ.1.44 కోట్లకు గానూ 70 శాతంతో రూ.1.01 కోట్లతో రెండో స్థానంలో రాయదుర్గం, రూ.70.88 లక్షలతో మూడో స్థానంలో శింగనమల, రూ.1.37 కోట్లతో నాలుగో స్థానంలో తాడిపత్రి ఉన్నాయి. మిగిలిన ఐదు కమిటీలు లక్ష్యానికి దూరం పయనం సాగిస్తున్నాయి. ఇందులో 30 శాతం వసూళ్లతో రాప్తాడు చిట్టచివరి స్థానంలో ఉండగా 37 శాతంతో గుత్తి, 46 శాతంతో ఉరవకొండ, 47 శాతంతో కళ్యాణదుర్గం, 48 శాతం వసూళ్లతో గుంతకల్లు మార్కెట్ కమిటీల్లో పన్ను వసూళ్లు నిరాశాజనకంగా ఉన్నాయి.

గడువులోపు అహుడా లే ఔట్ల పూర్తి


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న టీసీ వరుణ్, జేసీ

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం-హిందూపురం డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) లే ఔట్లను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి అందుబాటు ధరలో వినియోగదారులకు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నట్లు అహుడా చైర్మన్ టీసీ వరుణ్ పేర్కొన్నారు. బుధవారం అహుడా కార్యాలయంలో అహుడా వైస్ చైర్మన్, జేసీ శివ్‌నారాయణ్ శర్మతో కలసి ఆయన మాట్లాడారు. అంతకు ముందు కూడేరు, గుత్తి, మడకశిర ప్రాంతాల్లో నూతన ఎంఐజీ లే అవుట్ల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరులో 28.25 ఎకరాల్లో 390, మడకశిరలో 9.3 ఎకరాల్లో 123, గుత్తిలో 11.82 ఎకరాల్లో 123 ప్లాట్లను వేస్తున్నట్లు తెలిపారు. 40 అడుగుల సీసీ రోడ్లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, నీటి సరఫరా, సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, కరెంటు సరఫరా, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రైవేట్ వెంచర్లకు దీటుగా అహుడా లే అవుట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రాయితీతో స్థలాలను అందించనున్నామన్నారు. సమావేశంలో అహుడా కార్యదర్శి గౌరిశంకర్ రావు, కమ్మూరు పీఓ మహమ్మద్ ఇషాక్ అహమ్మద్; ఈఈ దుశ్యంత్, జేపీఓ హరీష్ చౌదరి, సర్వేయర్ శరత్‌బాబు, డీఈ రేవంత్‌రెడ్డి, ప్లానింగ్ కార్యదర్శులు ప్రమీల, నాగశ్రీ పాల్గొన్నారు.

వీసీల నియామకానికి కసరత్తు



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూఏకు సంబంధించి నూతన వైస్ చాన్సలర్ (వీసీ)ల నియామకానికి కసరత్తు మొదలైంది. ఈ మేరకు సెర్చ్ కమిటీలను నియామకం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జేఎన్‌టీయూఏ వీసీ నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వం నామినీగా డాక్టర్ రాంకుమార్ కాకాణి (డైరెక్టర్, ఐఐఎం, రాజ్‌పూర్), వర్సిటీ పాలక మండలి నామినీగా ప్రొఫెసర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్ (పూర్వ డైరెక్టర్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ పెట్రోలియం అండ్ ఎనర్జీ, విశాఖపట్నం), యూజీసీ నామినీగా ప్రొఫెసర్ కృష్ణపాల్ సింగ్ (వీసీ, మహాత్మా జ్యోతిబా పూలే రోహిల్‌ఖండ్ వర్సిటీ, ఉత్తరప్రదేశ్) ఉన్నారు. అలాగే ఎస్కేయూ సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వం నామినీగా డాక్టర్ రాంకుమార్ కాకాణి (డైరెక్టర్, ఐఐఎం ,రాజ్‌పూర్). పాలకమండలి నామినీగా ప్రొఫెసర్ ఎస్. శివప్రసాద్(ప్రో-వీసీ, గీతం వర్సిటీ), యూజీసీ నామినీగా ప్రొఫెసర్ సరిత్‌కుమార్ దాస్ (వి. బాలకృష్ణన్ చైర్ పర్సన్, డిపార్ట్‌మెంటల్ మెకానికల్ ఇంజినీరింగ్, ఐఐటీ మద్రాస్, తమిళనాడు) ఉన్నారు. వీరు వీసీ నియామకాలకు సంబంధించి అందిన దరఖాస్తులను పరిశీలించి మూడు పేర్లను ప్రతిపాదిస్తారు. వీరిలో ఒకరిని వీసీగా రాష్ట్ర గవర్నర్ ఎంపిక చేస్తారు.

క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ సుబ్బర హేమలత

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఎంపీపీ సుబ్బర హేమలత సూచించారు. బుధవారం వడ్డుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ నరసింహారెడ్డి, సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. గత ప్రభుత్వంలో జరిగిన నాడు–నేడు పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తయారీలో తాజా కూరగాయలు వాడాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివారెడ్డి, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న ఆప్టా సభ్యులు

ఆత్మకూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, ఆర్థిక కార్యదర్శి శంకర్‌మూర్తి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఆన్‌లైన్ సమస్యలను ఉపాధ్యాయ సంఘం దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల చెప్పిన విషయాలను రాష్ట్ర నాయకత్వానికి తెలియజేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు బోధనేతర పనులపై మినహాయింపు ఇచ్చి బోధనపై దృష్టి పెట్టేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీఏ, ఐఆర్‌లను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ కప్ ఫైనల్స్‌కు కర్ణాటక, మధ్యప్రదేశ్



ఇన్‌స్పైర్ కప్‌తో ఇరు జట్ల కెప్టెన్లు

అనంతపురం: అనంతపురం స్పోర్ట్స్ విలేజ్ వేదికగా లాలిగా ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ ఆఖరి ఘట్టానికి చేరుకుంది. బుధవారం నిర్వహించిన సెమీఫైనల్ మ్యాచ్‌లో కర్ణాటక, మధ్యప్రదేశ్ జట్లు గెలుపొందాయి. దేశ వ్యాప్తంగా 12 జట్లు ప్రాతినిధ్యం వహించిన ఈ టోర్నీలో ఇప్పటి వరకూ అన్ని జట్లూ విజయం కోసం హోరాహోరీగా తలపడ్డాయి. ఏ- టీంలో పాయింట్ల పట్టికలో కర్ణాటక మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం ఆడిన 5 మ్యాచ్‌ల్లోనూ గెలుపొందింది. అలాగే బీ- టీంలోని మధ్యప్రదేశ్ (నర్మదా వ్యాలీ) జట్టు ఐదు మ్యాచ్‌లో నాలుగు మ్యాచ్‌లు గెలుపొంది పాయింట్ల పట్టికలో మొదటి స్థానానికి ఎగబాకింది. ఈ రెండు జట్లు గురువారం ఫైనల్ మ్యాచ్‌లో తలపడనున్నాయి.

బాలికల విద్యతో ఆర్థిక స్వావలంబన



డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం అనంతపురం రూరల్ మండలం అంగన్‌వాడీ, ఆరోగ్య, సచివాలయ సిబ్బందికి కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతపురం రూరల్, ఉరవకొండ, నార్పల సీడీపీఓలు ధనలక్ష్మి, శ్రీదేవి, భారతి తదితరులు హాజరై మాట్లాడారు. బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగుపర్చడం ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామంలో జరిగే బాల్య వివాహాలను తగ్గించి వారిని చదువు దిశగా నడిపించడానికి ప్రతి గ్రామంలో మహిళా పోలీస్ కన్వీనర్‌గా కిశోరి బాలికల కమిటీలను వేయాలని సూచించారు. బాల్య వివాహాలతో ఎదురయ్యే దుష్పరిణామాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అదేవిధంగా సెల్‌ఫోన్‌ను అతిగా వినియోగించడం ద్వారా అనారోగ్యంతో పాటు చెడుకు దారి తీసే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో డ్రాపౌట్స్ తిరిగి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయశ్రీ, నీలావతి, భారతి, రూప్సీతో పాటు వెలుగు ఏపీఎం, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టమాట.. నష్టాల మూట!



టమాట పంటను గొర్రెలకు వదిలేసిన దృశ్యం

- ధరలు లేక పొలాల్లోనే వదిలేస్తున్న దిగుబడి
- 15 కిలోల బాక్స్ ధర రూ.70 లోపే
- అన్నదాతలకు తప్పని నష్టాలు

ఆత్మకూరు: టమాట రైతులకు నష్టాలు తప్పడం లేదు. టమాట ధరలు లేస్తే ఆకాశానికి .. పడితే పాతాళానికి అన్న చందంగా తయారయ్యాయి. రెండు మూడు రోజుల్లోనే ధరల్లో తీవ్ర వ్యత్యాసాలు ఏర్పడుతుంటడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సివస్తోంది. మండల వ్యాప్తంగా దాదాపు 8 వేల ఎకరాల్లో టమాట పంట సాగు చేశారు. ధరలు నిలకడగా ఉన్నాయన్న ఆశతో అప్పులు చేసి మరీ పంట సాగు చేసినా చివరికి నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. పంట సాగు చేయాలంటే నారు, కూలీలు, మందులు, ఎరువులు కలసి ఇలా ఒక ఎకరానికి దాదాపు రూ.50 వేల వరకు ఖర్చు పెట్టాల్సిందే.

వాతావరణమే కారణమా?

ఇరభై రోజుల క్రితం ఒక 15 కిలోల బాక్సు ధర రూ.300 వరకు మార్కెట్‌లో పలికింది. రానురాను ధరలు పడిపోవడంతో రైతులు పంటపై ఆశ వదులుకుంటున్నారు. ప్రస్తుత నెలకొన్న వాతావరణానికి మార్కెట్‌లో పంట అమ్ముడుపోవడం లేదని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఒక వైపు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందక, మరో వైపు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు నష్టాలను చవిచూస్తున్నారు.

పంట గొర్రెలకు వదిలేశా..

ఒక ఎకరాలో టమాట సాగు చేయాలంటే మందులు, నారు, కూలీలతో కలిపి దాదాపు రూ.50 వేలకు పైగా పెట్టుబడి వస్తోంది. ఇప్పటికీ కనీసం పెట్టుబడి కూడా అందలేదు. మార్కెట్‌కు పెద్ద ఎత్తున సరుకు వస్తుండటంతో డిమాండ్ పడిపోయింది. మార్కెట్‌లో పంట కొనడానికి వ్యాపారస్తులు ముందుకు రావడం లేదు. గిట్టుబాటు ధర కూడా లేదు. అందుకే పంటను గొర్రెలకు వదిలేశా.

– కొండా, ఆత్మకూరు

ఒక్క కోత కూడా కోయలేదు

మూడు నెలలకోసారి మార్చి మార్చి టమాట పంట సాగు చేశా. ప్రస్తుతం నాకు మూడు ఎకరాల్లో పంట కోతకు వచ్చింది. ధరలు ఆశాజనకంగా లేవు. మూడెకరాల్లో ఇంత వరకు పంట చేతికి వచ్చిన ఒక్క కాయ కూడా కోసి అమ్మలేదు. అంతా నష్టమే వచ్చింది. ప్రభుత్వం రైతులకు అండగా నిలబడాలి.

– పుల్లారెడ్డి, ఆత్మకూరు

పడిపోయిన ధరలు..

ప్రస్తుతం మార్కెట్‌లో టమాట చాలా చోట్ల నోసేల్ పడుతున్నాయి. దీంతో ఏం చెయ్యాలో దిక్కు తెలియక అన్నదాతలు పండించిన పంటలను రోడ్డు పాలు చేస్తున్నారు. మరి కొంత మంది గొర్రెలు, ఆవులను మేపుతున్నారు. మొదటి కటింగ్, రెండో కటింగ్ అయి టమాట కాయలు బాగున్నా 15 కిలోల బాక్సు ధర రూ.50 నుంచి రూ.70 కి పలకడం లేదు. మధ్య రకంగా ఉన్న టమాటలు కిలో 5 రూపాయలకు మార్కెట్‌లో అమ్ముడుపోతున్నాయి. కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.



ధరలు లేకపోవడంతో ఆత్మకూరులో పొలంలోనే వదిలేసిన టమాట

సమష్టి కృషితో మండలాభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

రాప్తాడు: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి సహకరించాలి. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖ, ఉద్యానవన, ఆర్టీసీ, సాంఘిక సంక్షేమ హాస్టల్స్, కేజీబీవీ నుంచి అధికారులు హాజరు కాలేదు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరుకాకపోతే సమస్యలు ఎవరితో చర్చించాలని సభ్యులు ప్రశ్నించారు. గ్రామాల్లో ఏవైనా పనులు చేసే సమయంలో సర్పంచులు ఉన్నారన్నా విషయాన్ని గుర్తించాలని పలువురు సర్పంచులు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని కుక్కలను ఇతర ప్రాంతాలకు తరలించాలని యర్రగుంట ఎంపీటీసీ సభ్యుడు రాముడు, రాప్తాడు సర్పంచు సాకే తిరుపాల్ కోరారు. రాప్తాడులో కరెంట్ సమస్యతో మోటర్లు కాలిపోతున్నాయని, సమస్యను పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈకి సూచించారు. ఆర్టీసీ బస్సులు రాప్తాడు మీదుగా కాకుండా బైపాస్ మీదుగా వెళ్తుండటంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి మాట్లాడుతూ.. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశాలకు మండల స్థాయిలో ప్రతి ఒక్క అధికారి హాజరు కావాలన్నారు. విధిలేని పరిస్థితిలో వారు హాజరు కాని పరిస్థితిలో వారి కింది స్థాయి అధికారి తప్పకుండా హాజరు కావాలన్నారు. వచ్చే సమావేశానికి మండల స్థాయి అధికారులు ఎవరూ గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం జరిగిన సమావేశానికి ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖ, ఉద్యానవన, ఆర్టీసీ, సాంఘీక సంక్షేమ హాస్టల్స్, కేజీబీవీ నుంచి అధికారులు హాజరు కాలేదని, వారిపై చర్యలు తీసుకుంటామ్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సంక్షేమం పట్టదా?



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య

అనంతపురం అర్బన్: 'కౌలు రైతుల రక్షణ, సంక్షేమానికి నూతన చట్టం తీసుకొస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలో చేపట్టి ఏడు నెలలు ముగిసినా ఆ చట్టం గురించి కనీసం ప్రస్తావించ లేదు. మీరు చెప్పిన నూతన చట్టం ఎక్కడ బాబు.' అంటూ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాటమయ్య, జమలయ్య నిలదీశారు. కౌలు రైతులకు జాయింట్ లయబిలిటీ గ్రూపులు ఏర్పాటు చేసి భూ యజమానులు తీసుకున్న రుణాలతో సంబంధం లేకుండా పంట రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన కౌలు రైతుల సమావేశంలో వారు మాట్లాడారు. పండించిన పంటలను కౌలు రైతులు ప్రభుత్వ కొనగోలు కేంద్రాల్లో అమ్ముకోలేక ప్రైవేటు వ్యాపాలకు అమ్మి నష్టపోతున్నారన్నారు. తక్షణం నూతన కౌలు చట్టాన్ని తీసుకొచ్చి ప్రయోజనం చేకూర్చాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. అన్నదాత సుఖీభవ కింద కౌలు రైతులకూ పెట్టుబడి సాయం ఇవ్వాలన్నారు. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెన్నప్పయాదవ్, చిరుతల మల్లికార్జున, కౌలు రైతుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, రామాంజనేయులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం ఎగ్గొట్టిన ఘనత బాబుదే'

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు విఘాతం కలిగిస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో జరిగిన విద్యాభివృద్ధిపై దేశం మొత్తం ఏపీ వైపు చూసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోజు రోజుకూ ప్రభుత్వ విద్యా వ్యవస్థ మసకబారుతోందన్నారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా.. రాష్ట్రంలో ఉన్న 17 విశ్వవిద్యాలయాలకు రెగ్యులర్ వీసీలను నియమించలేక పోయిందన్నారు. ఇన్‌చార్జ్‌ల పాలనలో యూనివర్సిటీల విద్యా వ్యవస్థ నత్తనడకన సాగుతోందన్నారు. కక్షపూరిత విధానాలకు స్వస్తి పలికి వెంటనే రెగ్యులర్ వీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ఈ ప్రభావం విద్యార్థుల చదువులపై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పి తొలి ఏడాది ఎగ్గొట్టారన్నారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులకు తీరని అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యా వ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలో రైతు వ్యతిరేక పాలన



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక పాలన సాగిస్తోందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున ధ్వజమెత్తారు. ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమానికి మద్దతుగా బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మల్లికార్జున మాట్లాడారు. రైతులను ఆదుకునే విషయంలో బీజేపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. రైతులకు రుణమాఫీ, మద్దతు ధరకు చట్టబద్ధత, రైతు ఆత్మహత్యల నివారణ, తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీ చేసిన సూచనలను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించారు. రైతులకు మేలు చేసేందుకు పార్లమెంటరీ కమిటీ చేసిన సూచనలనూ కేంద్రం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. పంజాబ్, హర్యాణా రాష్ట్రాల్లో రైతుల సమస్యల పరిష్కారానికి గత ఏడాది నవంబరు 21 నుంచి నిరాహార దీక్ష చేస్తున్న జగ్జిత్‌సింగ్ దల్లేవాలే ప్రాణాలు కాపాడాలన్నారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే బీజేపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కాటమయ్య, రాజేష్‌గౌడ్, వన్నారెడ్డి, నారాయణస్వామి, కృష్ణుడు, చిరంజీవి, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు మరో ఇద్దరు

- 'ఫేక్ పట్టాల' కేసు

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలంలో 'ఫేక్ పట్టాలు' సృష్టించి అమాయక ప్రజలను బురిడీ కొట్టించిన కేసులో మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గతంలో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. నకిలీ పట్టాలతో సాగిస్తున్న దందాపై ఇటీవల 'అమ్మేశారు...ముంచేశారు', 'రూ. 5 వేలు కొట్టు...పట్టా పట్టు', 'రూపాయికో పట్టా' శీర్షికలతో 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. ఈ క్రమంలో ఆధారాలతో సహా ముగ్గురిపై తహసీల్దార్ మోహన్‌కుమార్ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన ఎస్.నాగభూషణం ఇంటిపై దాడులు చేసిన పోలీసులు నకిలీ పట్టాలను గుర్తించి సీజ్ చేశారు. గత నెలలో నాగభూషణంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా నార్పల మండలం చామలూరు గ్రామానికి చెందిన చిక్కాల రామాంజనేయులు (ప్రస్తుతం అనంతపురం పాతూరులో ఉంటున్నాడు), అనంతపురం రూరల్ రాయల్‌నగర్‌కు చెందిన ఈడిగ వెంకటేష్‌గౌడ్‌ను అరెస్ట్ చేశారు. ఎస్.నాగభూషణంతో పాటు తామిద్దరమూ ఉప్పరపల్లి పొలం 19–8, కురుగుంట పొలం 122–2, 124–1, 125–, 126, 126–2 సర్వే నంబర్లలో నకిలీ పట్టాలు తయారు చేసి రూ. 35 వేలతో విక్రయించినట్లు విచారణలో నిందితులు అంగీకరించారు. తహసీల్దార్ సీలు, కార్యాలయం సీలు కూడా నకిలీవి చేయించినట్లు తేలింది. దీంతో ఇద్దరినీ బుధవారం కోర్టులో హాజరుపరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఆధారాలుంటే ఫిర్యాదు చేయండి

నకిలీ పట్టాలతో మోసపోయిన బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే సరైన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే నిందితులపై క్రిమినల్ కేసులకు సిఫార్సు చేస్తాం. నకిలీ పట్టాలు తయారు చేసే వారిలో ఎంతటి వారినైనా వదిలిపెట్టం.

– మోహన్‌కుమార్ తహసీల్దార్, అనంతపురం రూరల్

బీటెక్ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో నవంబర్, డిసెంబర్ నెలలో నిర్వహించిన బీటెక్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. బీటెక్ రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–23) రెగ్యులర్, (ఆర్–20) సప్లిమెంటరీ, ఒకటో సంవత్సరం మొదటి సెమిస్టర్ (ఆర్–19) సప్లిమెంటరీ, రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–15) సప్లిమెంటరీ, రెండో సెమిస్టర్ (ఆర్–20), (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి.నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

బాలికలే సమాజ సృష్టికర్తలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా 'భేటి సమ్మాన్–రెస్పెక్ట్ ద గర్ల్స్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐసీడీఎస్ పీడీ వనజ అక్కమ్మ, శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి బాలికలే రేపటి సమాజ సృష్టికర్తలన్నారు. బాలికలను గౌరవించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. బాలికల రక్షణకు అనేక చట్టాలొచ్చాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, కో–ఆర్డినేటర్ రాధాకృష్ణ నాయుడు, డీన్ రిషి బాల, అసిస్టెంట్ డీన్ ముత్యాలన్న, క్యాంపస్ ఇన్‌చార్జ్ రామకృష్ణ పాల్గొన్నారు.

వర్సిటీ పురోగతికి తోడ్పాటు అందించాలి

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పురోగతికి ప్రతి ఉద్యోగి తోడ్పాటు అందించాలని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురానికి సంబంధించిన 2025 డెస్క్‌టాప్ ప్లానర్స్, టెలిఫోన్ డైరెక్టరీ, అప్కాస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. 2025 సంవత్సరంలో వర్సిటీకి మెరుగైన ర్యాంకింగ్ రావడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య, ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఓ. దేవన్న, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11న ముగ్గుల పోటీలు

అనంతపురం కల్చరల్: కళామాధ్యమంగా గత నలభై ఏళ్లగా సమాజ హిత కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంస్కార భారతి ఆధ్వర్యంలో ఈనెల 11న సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నిర్వాహకుడు రాంకుమార్, జిల్లా ప్రతినిధి లక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక శిల్పా లేపాక్షి నగర్ ఎదురుగా ఉన్న పార్కు క్లబ్ హౌసు వేదికగా ఉదయం 9 గంటలకు రంగవల్లుల పోటీలుంటాయన్నారు. విజేతలకు బహుమతులందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 6303463700 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు

అనంతపురం ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నుంచి ఇద్దరికి చోటు కల్పించారు. బుధవారం కాకినాడలో యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా నుంచి దేవేంద్రమ్మకు వరుసగా నాలుగో సారి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా, రమణయ్యకు రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించారు. రాష్ట్ర కమిటీలో జిల్లాకు అవకాశం కల్పించడంపై జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, నాయకులు రామప్ప, సరళ, రాఘవేంద్ర, ఈశ్వరయ్య హర్షం వ్యక్తం చేశారు.

రఘు సైనిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం కల్చరల్: నగరంలో ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈనెల 4న నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణ పోటీల్లో స్థానిక సంఘమేష్ నగర్‌లోని రఘు సైనిక్ స్కూల్ విద్యార్థులు బృందగానంలో విశేష ప్రతిభ కనబరిచారు. బుధవారం సోమలదొడ్డి అభయాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ చాలీసా ప్రచార సమితి వ్యవస్థాపకుడు ప్రమోద్ స్వామి ప్రశంసాపత్రాలను అందజేశారు. స్కూల్ డైరెక్టర్ రాఘవేంద్ర, విద్యార్థులను అభినందించారు.

అన్నదానం

అనంతపురం కల్చరల్: హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ అజ్మీర్ షరీఫ్ ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కమలా నగర్‌లో ఫ్యాషన్ వీడియో విజన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం జరిగింది. లోక కల్యాణం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్యాషన్ బాషా, షేక్షావలి, షానవాజ్, నరసింహ, ఇజాజ్ ఖాన్ పాల్గొన్నారు.

ఎస్‌వీఐటీకి న్యాక్ గుర్తింపు

రాప్తాడు: మండలంలోని శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్‌ఏఏసీ) గుర్తింపు పొందడం గర్వకారణమని కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గుర్తింపు వల్ల కళాశాలకు ప్రమాణాలను మరింత అభివృద్ధి చేసుకోవడం, ఉద్యోగ అవకాశాలు పెంపొందించుకోవడం జరుగుతుందన్నారు. నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బీ.వీ. క్రిష్ణా రెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, కళాశాల ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, ఏఓ వెంకట శివా రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలు మరవొద్దు



బహుమతులు అందజేస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: మన సంస్కృతీ సంప్రదాయాలను ఎవరూ మరువకూడదని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు విద్యార్థులకు సూచించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వైద్యులు, పీజీ, హౌస్‌సర్జన్లు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో మెడికోలు చిన్ని తానియ, సాయిలిఖిత, డాక్టర్ పద్మ, డాక్టర్ శ్రావణి, డాక్టర్ భాను, డాక్టర్ శ్రావ్య కీర్తి, తదితరులు విజేతలుగా నిలిచారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్య రావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ షారోన్ సోనియా, తెలుగు మధుసూదన్, కేఎల్ సుబ్రమణ్యం, డాక్టర్ చలపతి, సీనియర్ వైద్యులు డాక్టర్ వైఎంఎస్ ప్రసాద్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ సుమన గోపిచంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆ సర్వేయర్ మాకొద్దు



తహసీల్దార్ విజయ కుమారికి ఫిర్యాదు చేస్తున్న గాండ్లపర్తి గ్రామస్తులు

రాప్తాడు: ఆ సర్వేయర్ మాకొద్దు.. వెంటనే కొత్త సర్వేయర్‌ను నియమించాలని గ్రామ ప్రజలు రెవెన్యూ సదస్సును అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. మండలంలోని గాండ్లపర్తి గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతుండగా.. ముందు గ్రామ సర్వేయర్ శ్రావణ్ కుమార్‌ను మార్చితే రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని లేకపోతే అడ్డుకుంటామని గ్రామస్తులు అడ్డుకున్నారు. గత ప్రభుత్వంలో మా గ్రామంలో రీ సర్వే పూర్తి చేయడం జరిగిందని.. అప్పట్లో సర్వేయర్ ఒక్కొక్క రైతుకు ఒక్కొక్క ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ మెంబర్) ఇవ్వకుండా దాదాపుగా 280 మంది రైతులకు జాయింట్ ఎల్‌పీఎం ఇచ్చారన్నారు. జాయింట్ ఎల్‌పీఎం ఇవ్వడంతో బ్యాంక్‌లో క్రాప్ లోన్ రెన్యూవల్ చేయడానికి వెళ్తే బ్యాంక్ మేనేజర్ ఒప్పుకోవడం లేదన్నారు. తహసీల్దార్ విజయ కుమారి మాట్లాడుతూ.. సమస్య పరిష్కరించేందుకు ముగ్గురు మహిళ గ్రామ సర్వేయర్లను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వేయర్ శ్రావణ్ కుమార్‌ను మరొక గ్రామానికి బదిలీ చేస్తున్నామన్నారు.

2న వివాహ పరిచయ వేదిక

అనంతపురం కల్చరల్: తిరుపతిలో ఫిబ్రవరి 2న బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఎల్ఎన్ శాస్త్రి తెలిపారు. బుధవారం జిల్లా కార్యాలయంలో బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక, భీమరథ శాంతి కార్యక్రమాల పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అన్ని ప్రాంతాల నుంచి యువతీ యువకులు వస్తారన్నారు. వివరాలకు 9490446409 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. అఖిల భారత బ్రాహ్మణ కల్యాణోపాధ్యాయ వివాహ సమాచార వేదిక జాతీయ నాయకులు రామకృష్ణ శేషగిరిరావు, శాస్త్రి, నార్పల మారుతి, నరసింహారావు, సత్యనారాయణ, మురళీధర్, జ్యోతి, ద్రాక్షాయిని పాల్గొన్నారు.